848) కేదారగౌళ

ప॥ ఇద్దరి గూరిచితిమి యేము చెలికత్తెలము। పొద్దు కొకకొత్తలుగా భోగించరయ్యా॥

చ॥ ప్రేమముతో సేసపాల పెండ్లికూతురిదె వచ్చె। ఆముకొని సరసములాడవయ్యా।
ఆమని సిగ్గులతోడ నదె తెరలో నున్నది। చేముట్టి సేవలెల్లా జేయించుకోవయ్యా॥

చ॥ మక్కువతో నీ మేన మరదలిదివో వచ్చె। చక్కగా పాదాలీకెపై జాచవయ్యా।
వెక్కసాన తమకించి వేడుకతో నున్నది। గక్కనను దప్పక మొగము చూడవయ్యా॥

చ॥ అరుదై శ్రీవెంకటేశ అలమేలుమంగ వచ్చె। బెరసి రతులను నిట్టెపెనగవయ్యా।
గరిమ వేళగాచి నీకౌగిటిలోనే నున్నది। సరికిబేసికి నీవు చనవియ్యవయ్యా॥